Eenadu

01-21/11/17

# స్తంభాలకు సొబగులు!

కేసీఆర్ పార్కు ముందు మొక్కలు నాటుతున్న కార్మికులు



## మెట్రో పిల్లర్లపై కళాకృతులు

## జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌లో ప్రారంభమైన పనులు

న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

మెట్రో పిల్లర్లు మన సంస్కృతిని ప్రతిబింబించేలా ముస్తాబవుతున్నాయి. రంగులద్దుకొని అతిథులకు ఆహ్వానం పలికేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోపాటు ట్రంప్ కుమార్తె ఇవాంక నగరానికి రానున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ దారులను ముస్తాబు చేస్తున్నారు.



స్తంభంపై చిత్రాలు దీస్తున్న కళాకారుడు

మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఈ నెల 28న ప్రపంచ పారిశ్రామిక వేత్తల సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి అమెరికా అధ్యక్షులు ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్ విచ్చేయనుంది. ఇవాంక బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ మీదుగా హెచ్‌ఐసీసీకి చేరుకుంటారని ప్రాథమికంగా అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ దారులను కొద్ది రోజులుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పాదచారుల బాటలను అందంగా తీర్చిదిద్దడంతోపాటు వాటికి రంగులు వేస్తున్నారు. మెట్రో నిర్మాణ పనులు జరుగుతున్న రహదారుల్లో నల్ల తారు(బీటీ) వేశారు. ఎక్కడా గోతులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేబీఆర్ కూడలి నుంచి- మొదలుకొని హైటెక్ సిటీ వరకు ప్రధాన రహదారి పక్కన ఉన్న పాదచారుల బాటలకు ఎరుపు, తెలుపు రంగులు వేస్తూ ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు.



### విభాగినుల్లో పచ్చదనం

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ కూడలి నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ఉన్న విభాగినుల మధ్య అలంకరణ మొక్కలతో పచ్చదనం పరచుకుంటోంది. ఇప్పటికే కేబీఆర్ కూడలిలోని విభాగినుల్లో అలంకరణ మొక్కలను తెచ్చి నాటారు. మెట్రో నిర్మాణ పనులు సాగుతున్న రోడ్ నం.36లో పాదచారుల బాట పక్కన గ్రీన్ పాత్‌ను అందుబాటులోకి తేనున్నారు.

### నిలువెత్తు అందాలు

తొలుతగా రంగుల సుందరీకరణలో భాగంగా మెట్రో పోర్టల్స్(స్వాగత తోరణాల్లా ఉండే పిల్లర్లకు) రంగులు వేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఊహా చిత్రాలను రూపొందించారు. తదనుగుణంగా ఆయా పోర్టల్స్‌పై హైదరాబాద్ చరిత్రను ప్రతిబింబించే చిత్రాలను వేయనున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి పెద్దమ్మగుడి వరకు మధ్యలో ఉన్న మరో పది పిల్లర్లకు రహదారికి ఇరువైపులా కనిపించేలా తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా చిత్రాలు వేస్తున్నారు. ఆయా పనులను సోమవారం ప్రారంభించారు. బతుకమ్మ, బోనాలు.. ఇలా అన్ని ఈ చిత్రాల్లో ఉండేలా చూస్తున్నారు. మరోవారంలో పనులు పూర్తికానున్నాయి.